## అడల్ట్స్ ఓన్లీ కథ



# A వలపు గణితం

కర్టెన్ వేయబోతూ కిటికీ లోంచి చూసింది తన్మయి. నీలంగా ఉన్న ఆకాశంలో మనోజ్ఞంగా ఉన్న నెలవంక, ఆ వెన్నెలతో చల్లదనాన్ని సంతరించుకుని సుతారంగా వీస్తున్న గాలి, ఆ గాలి సంగీతానికి తలలు ఊపుతున్న చెట్లు, కోరి బెడ్‌రూమ్ పక్కన నాటించుకున్న నైట్‌క్వీన్ వెదజల్లుతున్న పరిమళాలు.. అన్నీ కలిసి ఓ అద్భుత దృశ్యాన్ని తయారుచేశాయి. వినయ్ చూస్తే రెచ్చిపోతాడు అనుకుని హడావిడిగా కర్టెన్ వేసింది తన్మయి.

అక్కడ ఆమె భర్త వినయ్ మంచం మీద పడుకుని జోక్స్ పుస్తకం చదువుతున్నాడు. డ్రెసింగ్ టేబుల్ అద్దంలో కనబడుతున్న అతని ప్రతిబింబాన్ని చూస్తూ జోక్స్ చదువుతూ ప్రసన్నంగా ఉన్నాడు కదా ఈ పూట వినయ్‌కి కోపం రాదేమో అని ఆశ పడింది తన్మయి.

ఇంతలో వినయ్ పకపకా నవ్వుతూ జోక్స్ పుస్తకం విసిరేశాడు. నవ్వు ఆపి తన్మయితో అన్నాడు. ''ఈ జోక్ బాగుంది. ఫస్ట్‌నైట్‌న కొత్తపెళ్ళికూతురు పాలగ్లాసు పట్టుకుని గదిలోకి వచ్చిందిట..''

టక్కున అతనికి అడ్డు తగిలింది తన్మయి. ''వినయ్! ప్లీజ్!..నాకు జోక్ వినే మూడ్ లేదు''


వినయ్ వెంటనే పక్కన ఉన్న టేబుల్ వంక చూశాడు. దాని మీద తన్మయి అమర్చుకున్న కాయితాలు, ఫైళ్ళు కనబడ్డాయి.

''జోక్ వినే మూడ్ లేదు కాని ఆఫీస్ పని చేసుకునే మూడ్ బాగా ఉన్నట్లుంది. యామై రైట్?'' అవునన్నట్లుగా ఊపింది తన్మయి.

''ఐ ప్రొటెస్ట్..ఇది చాలా చాలా చాలా టూ మచ్! మొన్న చూడలేదా? నాతో తల నెప్పి అని చెప్పావు. నేను కంగారుపడి నీకు ఆస్ప్రో ఇచ్చాను. మంచి కాఫీ తాగించాను. జండూ బామ్ రాశాను. పావుగంట తరువాత నువ్వేమో 'పోయిందే.. గాయబ్..ఇట్స్‌గాన్..' అని మూడు భాషలలో ప్రకటించి ఆఫీస్ పని చేసుకుంటూ కూర్చున్నావు. ఈ అమ్మాయి ఇలా చేసిందేమిటా అని అమాయకుడ్ని నేను నాకు సరిగా రాని ఉర్దూలో కూడా బాధపడి బుర్ర బద్దలుకొట్టుకున్నాను. చివరికి నాకు తలనెప్పి వచ్చింది. నేనే స్వయంగా కాఫీ కలుపుకుని తాగి మాత్ర వేసుకున్నాను గుర్తుందా?''

వినయ్ కంప్లయింట్ తలనెప్పి గురించి కాదని తన్మయికి తెలుసు. ఒక్క రాత్రి విడిగా పడుకుంటేనే వినయ్ అంత తిక్కగా ఎందుకు మారిపోతాడో తన్మయికి అస్సలు అర్థం అవదు.

''ప్లీజ్ వినయ్! చాలా ఇంపార్టెంట్ వర్క్...ఎలాగయినా రేపటికి పూర్తి కావాలి. అర్థం చేసుకో'' అంది తన్మయి ప్రాధేయపూర్వకంగా.



యస్యూ

''అర్థం చేసుకున్నాను కాబట్టే నీ పద్ధతేం బాగా లేదని అంటున్నాను. నీ ఆఫీస్ వర్క్ ఎంత ముఖ్యమో ఈ బెడ్రూమ్ హోమ్ వర్క్ కూడా అంత ముఖ్యమే కదా!''

వారి పెళ్ళయి ఏడాదిన్నర అయింది. మొదటి సంవత్సరం అద్భుతంగా గడిచింది. అయితే గత నాలుగు నెలలుగా ఇలాంటి గొడవలు మొదలయ్యాయి. తన్మయకి ప్రమోషన్ రావటం, ఆఫీస్‌లో ఆమెకి పని బాగా పెరగటం అంతర్లీనంగా ఈ గొడవలకి దోహదమయ్యాయి.

''ఆ పని రేపటికల్లా అయిపోవాలి. ప్లీజ్ అండర్ స్టాండ్!'' తన్మయ ప్రాధేయపూర్వకంగా అంది.

''నేను అర్థం చేసుకోను. ఎందుకంటే ఈనాటి ప్రాముఖ్యతని సారీ.. ఈ రేయి ప్రాముఖ్యతని నువ్వు విస్మరిస్తున్నావు. ఆ సంగతి నీకు తెలుసా?''

తన్మయకి బోధపడలేదు. ఆ రోజు తమ పెళ్ళి రోజు కాదు. ఇద్దరిలో ఎవరి పుట్టిన రోజూ కాదు. వాలంటైన్స్ డే కాదు. వైఫ్స్ డే కాదు. హస్బెండ్స్ డే కాదు. చివరికి ఫ్రెండ్‌షిప్ డే కూడా కాదు. కాముని పున్నమి కాదు. ఆ మాటకి వస్తే పున్నమే కాదు!

''ప్రాముఖ్యతా.. ఏమిటది వినయ్?''

''ఎక్స్‌పెక్ట్ చేశా! నీకు గుర్తేం ఉండదని ఊహించాను'' దొర్లి ఆమెని చేరి ఒడిలో తల వాల్చాడు వినయ్. అప్రయత్నంగా అతని చెంపలని తడిమింది తన్మయ. అతనికి ఇంత దగ్గరవటంలో ఎంత సుఖం ఉందో చూడు అన్న ఆలోచనతో మనసు గుబగుబలాడింది. శరీరం పులకరించింది. ఆఫీస్ వర్క్‌కో గోలీమారో అని ఆమె శరీరం మనసూ రెండూ సలహా ఇచ్చాయి. ఇలా ప్రలోభాలకి లొంగిపోతే రేపు బాస్ దగ్గర చివాట్లు తినాల్సి వస్తుంది. ఇంకో ప్రమోషన్ దూరమవుతుంది అని బుద్ధి చివాట్లు వేసింది. ఏం చేయాలో తోచక తన్మయ గుటకలు మింగింది. వినయ్ మొహంలో చిరునవ్వు మెరిసింది. ''సరిగ్గా రెండేళ్ళ క్రితం సరిగ్గా ఇదే రాత్రిన కొంచెం అటూ ఇటూగా ఇదే సమయానికి మనం మొదటిసాగా ఒకరికి ఒకరం పరిచయం అయ్యాం. ఎట్‌లీస్ట్ ఆ సంగతి గుర్తుందా?''

ఆమెకి టక్కున గుర్తుకి వచ్చింది. ఓ స్నేహితురాలి పెళ్ళిలో వారి మొదటి పరిచయం అయింది. కాని 'మా తొలిచూపుల ద్వితీయ వార్షికోత్సవ సందర్భంగా టైమ్ చాలక ఆఫీస్ వర్క్ పూర్తిచేయలేకపోయాను' అని బాస్‌కి చెప్పటమూ కష్టమే, పని పూర్తి అవలేదంటే ఆయనకి నచ్చచెప్పటమూ కష్టమే! ఏం చేయాలి? బాస్‌కి నచ్చచెప్పటం కష్టం కాని మంచి బాలుడిలాంటి భర్తని బురిడీ కొట్టించటం తేలికేమో కదా అన్న ఊహ ఆమెకి ధైర్యాన్ని ఇచ్చింది. ''మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే వినయ్!'' అంది తీయగా.

''థాంక్ యూ'' అన్నాడు వినయ్ సంతోషంగా. ''అమ్మయ్యా! ఎలాగయితేనేం అమ్మాయిగారు మూడ్‌లోకి వచ్చారు'' అన్నాడు సంతృప్తిగా. ''మరి ఇప్పుడు మనమిద్దరం కలిసి సెలబ్రేట్ చేసుకోవాలి కదా..నాకో కొత్తరకం ఆలోచన వచ్చింది. అదేమిటో చెప్పనా?'' భార్య మొహంలోకి చూస్తూ అడిగాడు.

''సెలబ్రేషనా?'' తన్మయ గుండెల్లో రాయి పడింది. ఇప్పుడు సెలబ్రేషన్ అంటే కొంపమునిగినట్లే! పైగా కొత్తరకం ఆలోచన అంటున్నాడు. అసలే టైమ్ లేదనుకుంటుంటే వినయ్ కొత్తరకం సరదాలు అనీ సరసాలు అనీ అల్లరి చేస్తే అయినట్లే! జారిపోతున్న మనసుని కూడగొట్టుకుంది తన్మయ.



''ప్లీజ్! వినయ్! ప్లీజ్ నువ్వు మంచి అబ్బాయివి కదా! ఇక లెట్ మి ఫినిష్ ది వర్క్'' సుతారంగా అతన్ని తోస్తూ అంది తన్మయ.

ఆమె అంత గట్టిగా తోయలేదు కాని కావాలని వినయ్ విసురుగా నేలపైకి దొర్లాడు. ''మొగుడ్ని మంచం పైనుండి తోసేసి నువ్వేం బావుకుంటావో నాకు అర్థం అవటంలేదు మిసెస్ తన్మయా!''

వినయ్ అలా చిలిపిగా అడగటం, అతను కుడి బుగ్గని పరువుకి ఆన్చి దీనంగా చూడటం రెండూ ఆమెని ఓ నిముషంపాటు కదలకుండా కట్టేశాయి. ఒప్పేసుకుంటే సరిపోతుంది కదా అని మనసు, శరీరం రెండూ సంబరపడ్డాయి. అంతలో బుద్ధి కర్తవ్య దీక్షని గుర్తుచేసింది. ''ఈ పూటకి ఎలాగో ఎడ్జస్ట్ అవుబాబూ'' అంటూ టేబుల్ వంక కదిలింది.

అప్పటికి వినయ్‌కి తెలిసిపోయింది. ఇక భూకంపం వచ్చినా ఉప్పెన ఊరిని ముంచెత్తినా తన్మయ ఆఫీస్ పని చేసే తీరుతుంది. చేసేదేం లేక వినయ్ అలిగి మౌనవ్రతం పట్టాడు.

ఆ మర్నాటి ఉదయం వినయ్ మామూలుగానే నిద్ర లేచాడు. రాత్రి ఆలశ్యంగా పడుకున్న తన్మయ ఇంకా గాఢనిద్రలో ఉంది. ఆమెని మేల్కొలిపే ప్రయత్నం చేయలేదు అతను. ఇంకా అతని కోపం తగ్గలేదు. అతనికి సరిగా గుర్తులేదు కాని ఇలా జరగటం అయిదో సారో ఏడో సారో..నెలకో మూడు వారాలకో ఇలా జరుగుతున్నా భవిష్యత్తులో అది ఓ దినచర్యగా మారుతుందా అన్న అనుమానం వినయ్‌ని భయపెట్టసాగింది. ఏం చేయాలా అన్న ఆలోచనలో

## ఏనాటిదీ బంధం?!!

**రాజకీయాల్లోలాగే ఇక్కడ కూడా శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరేమో! ఎప్పుడూ ఆఫర్ల గురించి తిరిగే తారలు ఒకేచోట కలిసి మెలిసి ఉండడం, అందునా ఆ బంధాన్ని శాశ్వతం చేసుకోవాలనుకోవడం వింతగా ఉంటుంది. ఇప్పుడు సెలీనాజైట్లీ, లారాదత్తా, ఈషాడియోల్‌ల త్రయం ఎక్కడో చోట కలుసుకుంటూనే ఉంటున్నారు. సినిమాల గురించి, కుటుంబ విషయాల గురించి వారు చర్చించుకుంటూ హేపీగా ఉంటున్నారు. ఈనాటి వీరి బంధమేనాటిదో!**

పడ్డాడు. అరగంట తరువాత తన్మయ నిద్ర లేచిందని గమనించి అతను కిచెన్‌లోకి దూరాడు.

టవల్‌తో మొహం తుడుచుకుంటూ తన్మయ ఆబ్సెంట్‌మైండెడ్‌గా టివి ముందు కూలబడింది. టివి నుండి శబ్దం ఒక్కసారిగా పెరగటంతో ఆలోచనల నుండి బయటపడింది తన్మయ. రిమోట్ చుట్టుపక్కల లేదు.. అయితే కిచెన్‌లో నుండే వినయ్ రిమోట్ ఉపయోగించాడన్నమాట! ఎందుకబ్బా అనుకుంటూ తెరవంక చూసింది. అక్కడ ఆమెకి ఇష్టమయిన పాట వస్తున్నది. ''ఏయ్ తన్మయా! నీ ఫేవరిట్ సాంగ్.. విను'' అని నోరు విప్పకుండానే తనకి తెలియచేయటానికి కాబోలు భర్త అవస్థ పడుతున్నాడు అనుకుంది.

ఎప్పుడు వచ్చాడోకాని మౌనంగా వినయ్ ఆమెకి ఓ కప్పు అందించాడు.

''థాంక్స్!'' అంటూ కప్పు అందుకుని కాఫీ ఓ గుక్క తాగింది. వినయ్ చేసిన కాఫీ అద్భుతంగా ఉంటుంది అనుకుంది. అప్రయత్నంగా ఆమె వదనంలో చిరునవ్వు మెరిసింది.

బహుశా ఆ చిరునవ్వు ప్రభావంతోనే కాబోలు వినయ్ కరిగి మాట కలిపాడు. ''ఒక్క థాంక్సేనా.. ఐ మీన్.. థాంక్స్ ఒక్కసారే చెబుతున్నావా?''

''అవును. ఇంకోసారి చెప్పాల్సిన అవసరం ఏముంది?'' అసలు అలా థాంక్స్ చెప్పటం కూడా నీ అదృష్టం బాబూ అన్న లెవల్‌లో అంది తన్మయ.

''పొద్దున్నే మంచి కాఫీ నీ చేతికి అందించానా?''

''అందుకే థాంక్స్ చెప్పానుగా?'' బాకీ తీరిపోయిందన్నట్లు చెప్పింది తన్మయ.

''నీకు ఇష్టమయిన పాట వస్తుంటే వాల్యూమ్ పెంచానుగా! మరి దానికో!'' వినయ్ నిలదీశాడు.

''ఆ పాటా? నాకు ఇష్టమా? ఏమో! అయినా ఆ పాట ఇప్పుడు ఎవరు వింటున్నారని?'' కావాలనే తన్మయ తన చూపులు కిటికీలోంచి బయటికి పాకించింది.

వినయ్‌కి సర్రున కోపం వచ్చింది. ఒక్క ఉదుటున లేచి నుంచున్నాడు. ''అవునమ్మాయి! ఆ పాటా వినటం లేదు. మొగుడి మొహం చూడటం లేదు. ముద్దూ ముచ్చటా లేవు. ఇంతకీ నువ్వేం చేస్తున్నట్లు?''

నిజమే! ఉద్యోగపు హడావిడిలో ఇలాంటివి తీయటివి ఎన్నో పోగొట్టుకోవాల్సి వస్తున్నది కదా! కాని చదివిన చదువుకి, చేస్తున్న ఉద్యోగానికి న్యాయం చేయాలంటే అప్పుడప్పుడూ సర్దుబాటు తప్పదేమో! కప్పు టీ పాయ్ పైన ఉంచింది తన్మయ. అంతలోనే అందులో ఇంకా కాఫీ మిగిలి ఉందని గమనించి మళ్ళీ కప్పుని పెదవులకి చేర్చింది. 'ఇష్ట కష్టాలని ఇప్పుడేమంటారో? ఈ మోహమాటాలని మరి ఏమంటారో? సమీప దూరాలని అసలేమంటారో?' ఆమెకి ఇష్టమయిన పాట ఇలా సాగుతూనే ఉంది. తన్మయ ఆలోచనలో పడింది. నిజమే! తమవి ఇష్టకష్టాలే... మోహమాటాలే కావు. మొహమాటాలు కూడా ఇప్పుడిప్పుడే చోటు చేసుకుంటున్నాయి. అయితే తామిద్దరు సమీపంగా ఉంటూ దూరమవుతుంటే మాత్రం జాగ్రత్తపడాలి! కాని ఇంతకంటే ముఖ్యం ఇప్పటి తక్షణ కర్తవ్యం. ఇంకో రెండు పేపర్లు సరిచూస్తే ఆఫీస్ పని అయిపోతుంది. తరువాత తీరికగా తమ కాపురం గురించి ఆలోచిస్తే సరి! కప్పులో చుక్క కూడా మిగల్చకుండా తాగేసి లేచింది తన్మయ.

వినయ్ అనునయంగా అన్నాడు. ''ఒప్పేసుకో తన్మయా! ఇలాంటివన్నీ మనం ఈమధ్య మిస్ అవటం లేదా? ఎందుకొచ్చిన ఆ ఆఫీస్ పని? ఎందుకు అన్నేసి బాధ్యతలు భుజాన వేసుకుంటావు? కొంచెం ఆ పనులు తగ్గించుకోవచ్చు కదా!''

అతను అన్నదాంతో పూర్తిగా ఏకీభవిస్తున్నా పైకి ఒప్పుకునేందుకు తయారుగా లేదు తన్మయ. అందుకనే అంది ''నా కెరీర్ నాకు ఎంతో ముఖ్యం అని నేను అప్పుడే చెప్పాను. నువ్వు ఒప్పుకున్నావు కూడా''

నిజమే! ఒకరికి ఒకరు నచ్చారు. ఇక ముహూర్తాలు పెట్టుకోవచ్చు అని పెద్దలు అనుకుంటుంటే తన్మయ అతన్ని కలిసి చర్చించింది. ''నా కెరీర్‌లో నాకు కొన్ని గోల్స్ ఉన్నాయి. పెళ్ళి అయితే నా ఆశలు ఊహలు దెబ్బతింటాయన్న భయం నాకు ఉంది. అందుకనే ఇంకో మూడేళ్ళ తరువాత పెళ్ళి చేసుకోవాలనుకున్నాను. కానీ మమ్మీ, డాడీ బాగా ఫోర్స్ చేశారు. ప్లీజ్ అర్థం చేసుకోండి''

వినయ్ చాలా ఉదారంగా స్పందించాడు. ''అదేమిటి తన్మయా! నా కెరీర్‌కి నేను ఎంత ప్రాధాన్యత ఇస్తానో అలాగే నువ్వూనూ.. నా ప్రోత్సాహం నీకు ఎప్పుడూ ఉంటుంది'' అంటూ భరోసా ఇచ్చాడు. అప్పుడు ఓవర్‌గా తన్మయకి ఆశలు కల్పించటం చాలా పెద్దపొరపాటు అని ఇప్పుడు అనిపించసాగింది అతనికి.

దీర్ఘంగా ఆలోచిస్తున్న వినయ్‌ని చూస్తుంటే ఒక్కక్షణం గిల్టీగా తోచింది తన్మయకి. ఆఫీస్ పని అలా ఇంటికి తెచ్చేసుకోవటం తప్పేమో! వినయ్ భుజం మీద సుతారంగా తలవాల్చింది. ''ఏమిటా ఆలోచనలు బాబూ?''

వినయ్ మాటల కోసం తడుముకున్నాడు. ''ఏమీ లేదు'' అన్నాడు.

అతనికి నచ్చచెప్పే ప్రయత్నం చేసింది తన్మయ. ''నువ్వు అలిగావని నాకు తెలుసులే. మొన్న బిల్డర్‌కి ఇవ్వాల్సిన డబ్బులు తక్కువయితే ఏం చేశాం? ఫర్నిచర్ తరువాత కొనచ్చులే అని దానికి కేటాయించిన డబ్బులు బిల్డర్‌కి ఇచ్చామా లేదా? అలాగే ఈ ఎడ్జస్ట్‌మెంట్ కూడా. ఆఫీస్‌లో టైమ్ సరిపోవటం లేదు కాబట్టి ఇంట్లో చేయాల్సి వస్తున్నది. సింపుల్ మేధమెటిక్స్ మిస్టర్! దానికి మరీ ఇంత బిక్కమొహం పెడితే ఎలా బాబూ?'' అనునయంగా చెప్పింది.

వినయ్ మాట్లాడలేకపోయాడు. తన్మయ లాజిక్ బాగానే ఉంది. కానీ మాటలకి లొంగిపోయి సుఖాలకి దూరమవటానికి అతను తయారుగా లేడు. ఆ తరువాత చాలారోజులు తన్మయ గుడ్ గర్ల్ లాగా ప్రవర్తించింది. ఒక్కనాడు కూడా ఇంటికి ఆఫీసు పనులు తీసుకురాలేదు. అలా దాదాపు నెలరోజులు గడిచాయి.

శని, ఆదివారాలకి దీపావళి, రంజాన్‌లు చెరో పక్కా రావటంతో ఇద్దరికీ వరసగా నాలుగు రోజుల సెలవులు వచ్చాయి. ఆ నాలుగు రోజులూ గోవా వెడదామని ప్లాన్ చేసుకున్నారు.

అయితే బుధవారం నాడు వినయ్ ఆఫీస్‌కి తన్మయ ఫోన్ చేసింది. దీపావళికి రెండు రోజులు ముందే ఓ బాంబ్ పేల్చింది. ''వినయ్! చిన్న ప్రాబ్లెమ్ వచ్చింది. శనివారం నాడు మా యండి బాంబే నుండి వస్తున్నాడుట. ఆరోజు నేను తప్పకుండా ఉండాలని మా బాస్ అంటున్నాడు.



నువ్వు బాగా డిజప్పాయింట్ అవుతావని నాకు తెలుసుకాని ఏం చేయాలి? అప్పటికీ నో ఛాన్స్ అని నేను గట్టిగా చెప్పాను. కాని మా బాస్ వదలలేదు. తనే నీకు ఫోన్ చేస్తానని అన్నాడు. అదేం అవసరం లేదు వినయ్ విల్ అండర్‌స్టాండ్ అని అన్నాను. పెద్దవాడు పాపం బాగా ప్రాధేయపడ్డాడు. పైగా యండికి నాపైన మంచి అభిప్రాయం ఉందిట. కానీ ఇంతవరకూ ఆయన్ని నేను డైరెక్ట్‌గా కలవలేదు. ఇప్పుడు ఆయన బాగా ఇంప్రెస్ అయితే నా కెరీర్‌కి చాలా ఉపయోగం. అయామ్ సారీ.. మన ప్రోగ్రాం నా వల్ల

క్యాన్సెల్ అవుతున్నందుకు నాకూ బాధగానే ఉంది''

ఈమధ్యకాలంలో ఏ గొడవా లేకుండా ప్రశాంతంగా గడిచింది. ఇలాంటి అవాంతరాన్ని ఎదుర్కోవటానికా? ఆఫీస్, కెరీర్ అంటూ వెంపర్లాడుతూ ఏం పోగొట్టుకుంటున్నదో ఈ అమ్మాయికి ఎలా తెలుస్తుంది?

''హలో! వినయ్! ఆర్యూ దేర్? నిజంగా సారీ! నాకు తెలుసు నువ్వు ఎంతో ఆశతో ఈ గోవా ప్రయాణం ప్లాన్ చేశావు. అయితే డిసెంబర్‌లో క్రిస్‌మస్ టైమ్‌లో కూడా ఇలాగే వరసగా నాలుగు రోజులు సెలవలు వస్తాయిట. అప్పుడు ఏమయినా సరే సెలవు ఇస్తానని మా బాస్ అంటున్నాడు''

ఎంత నిగ్రహించుకున్నా వినయ్ గొంతులో చిరాకు స్పష్టంగా పలికింది. ''క్రిస్‌మస్ టైమ్‌లో గోవా టూరిస్ట్‌లతో కిటకిటలాడుతుంది. అసలు ఎంజాయ్ చేయలేం. అదే ఇప్పుడయితే రద్దీ తక్కువ ఉంటుందని కదా ఇలా ప్లాన్ చేసుకున్నాం''

''నువ్వు చెప్పేది నిజమే కానీ..ఏం చేయగలను చెప్పు?'' తన్మయ అంది.

అసహాయత అతన్ని చుట్టుముట్టింది.

ఆ సాయంకాలం కావాలని వినయ్ ఆఫీస్ నుండి ఆలశ్యంగా వచ్చి తన నిరసనని ప్రకటించాడు. అతన్ని ఎలాగయినా ప్రసన్నం చేసుకోవాలని కాబోలు తన్మయ ముందుగానే వచ్చింది. అతనికి ఇష్టమయిన వంటకాలు చేసింది. కాండిల్ లైట్ డిన్నర్‌తో అతని కోపాన్ని తగ్గించింది. ఆ రాత్రి అతన్ని రెచ్చగొట్టి మిగిలిన కోపాన్ని మాయం చేసింది.

ఆ మర్నాడు లంచ్ తరువాత ఆమె ఆఫీస్‌కి ఫోన్ చేశాడు వినయ్. ''ఏమంటున్నాడు మీ బాస్? అయినా మీ యండి విజిట్ లేకపోతే ఇంకో నాలుగు గంటలలో ఇద్దరం ఎంచక్కా ట్రైన్ ఎక్కేవాళ్ళం కదా!'' వినయ్ స్వరం చేదుగా ధ్వనించింది.

''బాస్ సంగతి అటు ఉంచు. వరసగా నాలుగు రోజులు సెలవలు కదా. చాలామంది పర్మిషన్ తీసుకుని వెళ్ళిపోయారు. నాలాగా శనివారం ఆఫీస్‌కి రావాల్సిన వాళ్ళేమో ఎలాగూ ఆరోజు వస్తున్నాం కదా అని లంచ్ తరువాత వెళ్ళిపోయారు. ఆఫీస్ అంతా డెజర్టెడ్‌గా ఉంది'' తన్మయ గొంతులో పశ్చాత్తాపం తొంగి చూసిందా అన్న అనుమానం కలిగింది వినయ్‌కి. ''యండికి ఎలా మస్కా కొట్టాలా అని ఆలోచిస్తూ మా బాస్, నేనేం చేస్తున్నానో అర్థమవక సతమతమవుతూ నేనూ, మొత్తం ఆఫీస్‌లో ఇద్దరమే ఒంటరిగా ఉన్నాం''

''నువ్వు ఒంటరిగా లేవులే తనూ!'' అంటూ ఆమె కాబిన్ తలుపు తీసుకుని లోపలికి వచ్చాడు వినయ్. సెల్ ఆఫ్ చేసి జేబులో పెట్టుకుని తన్మయ వంక చిలిపిగా చూశాడు.

తన్మయ దిగ్గున లేచింది. ''వినయ్! వాటే సర్‌ప్రైజ్!''

వినయ్ చనువుగా టేబుల్ చుట్టి ఆమెని దాటుకుని వెళ్ళి ఆమె కుర్చీలో కూర్చున్నాడు.

''కోక్ తీసుకుంటావా?'' అడిగింది తన్మయ.

''నేను తీసుకునేది వేరే ఉంది'' అంటూనే ఆమె చేయి పట్టుకుని బలంగా తన ఒళ్ళోకి లాక్కున్నాడు వినయ్.

''ఏయ్! వినయ్! ఏమిటా పని?'' గొంతు తగ్గించింది తన్మయ.

''నువ్వు నాకో గణిత సూత్రం చెప్పావు గుర్తుందా? ఆఫీస్‌లో సమయం చాలకపోతే ఇంట్లో దొరికే సమయాన్ని వాడితే తప్పులేదు అని వాదించావు. బెడ్‌రూమ్‌ని ఆఫీస్ ఫైల్స్‌తో కలుషితం చేశావు. నేను ఇప్పుడు ఆ గణిత సూత్రాన్ని రివర్స్‌లో వాడుతున్నాను'' వినయ్ ఆమెని ఒడిసి పట్టుకున్నాడు.

''ప్లీజ్ వినయ్! ఎవరన్నా చూస్తే బాగుండదు'' అని. గింజుకుంటూనే ''రివర్స్‌లోనా? అంటే?'' అని కుతూహలం కొద్దీ అడిగింది.

''శనివారం మీ యమ్‌డి యముడి పర్యటన సందర్భంగా ఈ రాత్రి నువ్వు ఎన్నేసి ఫైళ్ళు తెస్తావో అన్న భయం అన్నమాట! అక్కడ ఇంట్లో దొరకని సమయాన్ని ఇక్కడ చేజిక్కించుకోవాలన్న తపన అన్నమాట! పైగా నువ్వు చెప్పినట్లే మీ ఆఫీస్ అంతా నిర్మానుష్యంగా ఉంది. ఎవరన్నా వచ్చి మనల్ని డిస్టర్బ్ చేస్తారన్న భయం అక్కరలేదు. కమాన్ లెటజ్ ఎంజాయ్''

''అదికాదు..'' అభ్యంతరం చెప్పబోయింది తన్మయ. ''ఇది ఆఫీస్ బాబూ!'' అంటూ అతని ఒడి నుంచి లేచి డ్రెస్ సవరించుకుంది.

''నువ్వేమో ఎక్కడ టైమ్ దొరికితే అక్కడే ఆఫీస్ పని చేసుకోవాలి అన్నావు. వలపు గణితమేమో ఎక్కడ వీలయితే అక్కడే రొమాన్స్ కానిస్తే తప్పేమిటీ అని అంటున్నది'' రెండు చేతులూ సాచి ఆమెకి దగ్గరయ్యాడు వినయ్.

తన్మయ అతనికి దూరంగా జరిగింది. క్షణంలో ఆమె ఓ నిర్ణయానికి వచ్చింది. ''నీ ఎత్తులు ఇక సాగవు మిస్టర్ వినయ్! నీ లాజిక్‌ని ఎలా ఎదుర్కోవాలో నీ ఆట ఎలా కట్టించాలో నాకు బాగా తెలుసు. లెట్ మి కాల్ మై బాస్'' టెలిఫోన్ అందుకుంది.

వినయ్ విస్తుపోయాడు. ''నీకు మతిపోయిందా? మా ఆయన ఆఫీస్‌కి వచ్చి ముద్దులూ మురిపాలూ అని యాగీచేస్తున్నాడు అని కంప్లయింట్ ఇస్తావా?''

మాట్లాడద్దు అన్నట్లు చేయి ఊపింది తన్మయ. అటుపక్క ఫోన్ తీసిన బాస్‌కి ఫర్మ్‌గా చెప్పింది. ''నేను ఈ రోజే ఊరు వెడుతున్నాను. అయామ్ వెరీ సారీ సర్! యండిగారికి నా క్షమాపణలు చెప్పండి'' బాస్ స్పందించే అవకాశం ఇవ్వకుండా ఫోన్ పెట్టేసింది.

వినయ్ అవాక్కయ్యాడు. ఊహాతీతంగా ప్రవర్తించి నిజంగానే అతని ఆటకట్టించింది తన్మయ.

అతని చేయి అందుకుని తీయగా నవ్వింది తన్మయ. ''కమాన్! బి క్విక్..మళ్ళీ మా బాస్ మెట్లు దిగి వచ్చేలోగా పారిపోదాం రా!''

మరునిముషం ఇద్దరూ లిఫ్ట్‌లో ఉన్నారు. తలుపులు మూసుకుని లిఫ్ట్ సుతారంగా కిందకి జారుతుంటే తన్మయ అంది. ''ఇంక్రిమెంట్లు ప్లస్ ప్రమోషన్లు ప్లస్ కెరీర్ ఈజ్ ఈక్వల్‌టూ ఎన్నో రూపాయిలు, ఆ ఎన్నో రూపాయిలు అంటే జీవితంలో ఎంతో ఆనందం కదా అనుకుని పరిగెత్తాను. అయితే ఆ విధంగా మనం కోల్పోతున్న తీయని క్షణాల ముందు డబ్బు చాలా అల్పమయిందన్న విషయం నాకు స్ఫురించింది. దానికి కారణం ఏమిటో తెలుసా? నువ్వు చెప్పిన వలపు గణితంలోని రివర్స్ సూత్రం!'' తన్మయ నవ్వింది. ''ఆఫీస్‌లో రొమాన్స్ ఎలా ఎబ్బెట్టుగా ఉంటుందో అలాగే బెడ్‌రూమ్‌లో ఆఫీస్ వర్క్‌కి స్థానం లేదని బాగానే బోధించావు! కాని ఒకటే..ఇప్పటికిప్పుడు మనం ఎక్కడికి వెళ్ళగలం? టికెట్లు ఎలా దొరుకుతాయి? నాకు నిన్ననే జ్ఞానోదయం అయి ఉంటే బాగుండేది''

ఆమె మాటలకి అడ్డు తగిలాడు వినయ్ ''ఇలాంటి మిరకిల్ జరుగుతుందనే ఆశతోనే నిన్న ఆ టికెట్లు క్యాన్సిల్ చేయలేదు. ఇవిగో టికెట్లు!''

''వండ్రఫుల్!'' తృప్తిగా అతని భుజం మీద తల వాల్చింది తన్మయ.

ఇక మీ ఆనందానికి ఏ ఆటంకాలు లేవు అన్నట్లుగా లిఫ్ట్ తలుపులు తెరుచుకున్నాయి.

☆

